# చుట్టాల రభస

శ్రీ పోతుకూచి సాంబశివరావు

పాత్రలు:

1. రామావధాని: మర్యాదస్థుడైన కుటుంబీకుడు.
2. సీతాయమ్మ: రామావధాని భార్య వెటకారపు మనిషి.
3. అనంతబుద్ధి:
4. నిరంజనదాసు: } చాలాదూరపు బంధువులు.
5. నానిబాబు: రామావధానికి తృతీయ పుత్రుడు.

## 1 వ రంగం

(రామావధానిగారి యింట్లో నిరంజన దాసు భాగవతకాలక్షేపం చేస్తూ)

ని: "చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్థులు, కాంతలు సంసారకారణములు."

ఇదిగో రామావధాన్లుగారూ! పోతన రచన చాల మృదుమధురంగా వుంటుందండీ.

రా: పోతనకవిత్వం నిరంజనదాసుగారి పఠనలో ద్రాక్షాపాకంలా ఉంటుందంటే సరిపోతుందిగా!

సీ: "కాంతలు సంసార కారణములు" అని వైరాగ్య జ్ఞానం చూపిన మనిషి, పోనీ, తను పెళ్లి చేసుకోడం మానేడాండి పోతన?

(టకటకమంటూ జట్కాచక్రం చప్పుడు)

ని: గృహస్థాశ్రమం జీవితధర్మం కనుక నిర్వర్తించాడే కాని, పోతన నిజంగా పెళ్లి కావాలని కోరేడనా మీ వుద్దేశ్యం! అబ్బే!

(జట్కా ఆగినచప్పుడు. పెట్టెలశబ్దం)

రా: ఇదిగో! సీతా! మన యింటి ముందు జట్కా ఆగినట్లుంది చూడు!

సీ! (వెటకారంగా) మరే! యింకెవరై ఉంటారు! ఎవరో చుట్టాలేమో!

(అనంతబుద్ధి ప్రవేశం)

అనం: రామావధాన్లుగారూ! నమస్కారం. అంతా క్షేమంగా ఉన్నారా!

రా: ఎవరది!

అ: నేను! నేనండి! జ్ఞాపకంరాదండీ!

రా: ఏమోనాయనా! ఎక్కడైనా చూసేనేమోకాని! అట్టే జ్ఞాపకంలేదు.

అ: నాపేరు అనంతబుద్ధి! హిహిహి... మీ మూడో అల్లుడు లేడూ! వెంకటశాస్త్రి!...వాడి అమ్మ అక్కగారి మనుమరాలిని మా తమ్ముడికిచ్చారు......అప్పుడప్పుడు మీ వెంకటశాస్త్రి నేనూ బాగా కలిసి తిరుగుతూండేవాళ్లం......పాపం! మీకు పెద్దతనం చేత జ్ఞాపకం తగ్గిఉండవచ్చు!......వెంకటశాస్త్రి పెళ్లికి నేను కూడా...అన్నట్టు రాలేదు, వద్దామనుకున్నాను. ఎప్పటికప్పుడు మీ యింటికి వద్దామనుకోవడమే. తీరుబడి ఉండది కనుకనా! జీవితమంతా యీ వుద్యోగంతో సరిపడేట్టు ఉందండి!

సీ: (హేళనగా) అయితే! నాయనా! మా అల్లుడి దొడ్డమ్మగారి మనుమరాలు చిట్టిని మీ తమ్ముడికిచ్చారన్నమాట!

అ: మరేనండీ! రెండునెలల క్రితం వెంకటశాస్త్రి మా యింటికి వచ్చాడు. నాకు యిక్కడి భండారుపురం బదిలీ అవుతుందని చెప్పినపుడు "ఓసారి మా మామగారి యింటికి వెళ్ళి చూసి రారా!" అన్నాడు. భండారుపురం వచ్చి ఏడాదైందనుకోండి! కాని తీరుబడో! ఎప్పటికప్పుడే వద్దామనుకోడం! ఏదో పని అడ్డు రావడం! యిన్నాళ్ళకి రాగలిగాను.

రా: నేను నిన్ను జూడటం యిదే మొదటిసారి. అయితే మా యిల్లు ఎల్లా కనుక్కోగలిగావోయి అనంతబుద్ధీ!

అ: ఏముందండీ. నోట్లో నాలికఉంటే ఏదైనా చెయ్యొచ్చు! ఫలానాచోట అని మా శాస్త్రి చెప్పాడు. ఇక్కడికి వచ్చాక నల్గురిని కనుక్కున్నాను. హి హి హి....



నేను మిమ్మల్ని చూడలేదు కానండీ. మీ ఫోటో, చూశాను. అందుచేత మిమ్మల్ని యిట్టే ఆనవాలు పట్టేశాను. హిహిహి.

సీ: (హేళనగా) మమ్మల్ని చూడక పోయినా, ఏదో ఆ బంధు అభిమానం పురస్కరించుకు వచ్చావు! చాలా సంతోషం నాయనా!

ని: బంధువుల అభిమానం అంటే అల్లా గుండాలి.

సీ: (వెటకారంగా) ఆ! ఆ! అల్లాగే ఉండాలి.

రా: (అనంతబుద్ధితో) ఈయన నిరంజనదాసుగారని చాల భక్తులు...హరిదాసులు...మనకి బంధువులు. యీ రెండు నెలలనుంచీ హరికథలతో మనవూరు పవిత్రం చేస్తున్నారు.

అ: నమస్కారమండీ.

ని: నిరంజనార్పణమస్తు!

రా: అయితే అనంతబుద్ధి! భండారుపురంలో ఏం చేస్తున్నట్లు నువ్వు?

అ: ఏముందండీ యీమధ్య ఆహార సేకరణ డిపార్టుమెంటు పెట్టారుకదూ! అందులో పని. నెల్లాళ్ళూ బయట అడ్డమైన పల్లెటూళ్లూ తిరగడంతో సరిపోతూం దండీ. నానాతిప్పలు పడాలి.

సీ: ఏ తిప్పలూ పడకపోతే అప్పనంగా డబ్బు యిస్తారటయ్యా ఎవరైనా?

రా: లేవోయి! లేవోయి! అనంతబుద్ధి! కాస్త భోంచేసి విశ్రమించుదుగాని! ఒరే నానిబాబు! కాళ్లు కడుక్కుందుకు నీళ్ళు తీసుకురా యీయనకి!

(నానిబాబు ప్రవేశం)

నానిబాబు: (నీళ్లు యిస్తూ) ఎవరికే అమ్మా నీళ్లు!

సీ: ఆయనకేరా! అనంతబుద్ధిగారికి...

అ: యితను మీ అబ్బాయేనండీ? ఏం చదువుతున్నావోయి పంతులు!

నాని: మూడవ ఫారము చదువుతున్నాను!

రా: వీడు మా మూడో కుఱ్ఱాడు.

అ: అయితే! నువ్వు నాకే మవుతావోయి పంతులు! చిన్నాన్న అవుతావన్న మాట! ఏముందోయి చిన్నాన్నగారూ!

సీ: వరుసలు, వావిలు, తరువాత చూసుకోవచ్చు! భోజనానికి లేస్తే బాగుంటుందేమో!

రా: మరే! భోజనానికి లేవోయి అనంతబుద్ధి.

అ: చిత్రం!...దాసుగారు; ఏదో చదువుతున్నట్లున్నారు.... నా రాక ఏమన్నా అభ్యంతరం...

సీ: అబ్బెబ్బే! ఏమీ అభ్యంతరం కలుగలేదు. ఆయన నిత్యం తీరుబడి మనిషి.

రా: మరే! ఎప్పుడు కావలిస్తే అప్పుడే చదివించుకోవచ్చు భాగవతం. ముందు భోజనానికి లెండి.


2 వ రంగం.

(రామావధాని, సీతాయమ్మ యింట్లో మాట్లాడుకుంటూ)

సీ: ఏమండీ! యిదేమన్నా సత్రమనుకున్నారా! సంసారం అనుకున్నారా! రెండు నెలలనుంచి పడి తింటున్నాడు ఆ దాసు! ఉద్యోగంపని యీ వూళ్ళో యింకా రెండు నెలలైనా పడుతుందంటాడు యీ అనంతబుద్ధి! యిల్లా నెలల తరబడి అడ్డమైనవాళ్లూ పడితింటూంటే సంసారాలు మట్టికొట్టుకపోవుటండీ!

రా: యింటికి బంధువులొస్తే ఆమాత్రం మర్యాద చెయ్యకపోతే బాగుంటుందా!

సీ: బంధువుల మర్యాదకుకూడా హద్దుపద్దూ లేదు! దగ్గర బంధువులైతే అనుకోవచ్చు. పోనీ! కానివాళ్లైతే అనుకోవచ్చు! ఆశమ్మ బోశమ్మ నాయనమ్మ మనవుడి



కొడుకునంటూ యీ అనంతబుద్ధి ఎవరు! ఆ దాసు చూడండీ! రెండు నెలలనుంచి హరికథల్లో సంపాదించింది బొడ్డున మూట కట్టేస్తున్నాడు. భోజన కాలక్షేపం మనింట్లోను. బోషాణంలో ధనం దాపరికం. మనలాంటి తెల్వితక్కువ వాళ్లెవరూ ఉండరు.

రా: ఊరుకో! వాళ్లు వస్తే బాగుండదు. వింటే ఏమనుకుంటారు?

సీ: వింటే నాకేమండీ! మంచీ చెడ్డా లేకుండా, నిర్మొహమాటంగా తిండికోసం తిష్ఠవేస్తే, మనకు మాత్రం పొమ్మనడంలో మొహమాటా లెందుకు?

రా: యిక్కడ వుంటే నీ పోరు తగ్గేటట్టు కనిపించడంలేదు. నేను బయటకు పోనా ఏమిటి?

సీ: ఏమన్నా అంటే బయటికి పోతాననడం బాగా తెలుసు. వెడితే వెళ్లండీ! వాళ్లు రాగానే బయటికి సాగనంపుతా!

రా: ఆసీ! నీయిల్లు బంగారంగానూ! అంతపనిమాత్రం చెయ్యకు. వంశమర్యాద నిలబడాలా!... నేను బయటికి పోతున్నా తలుపేసుకో!

(తలుపు మూసిన చప్పుడు)

సీ: దారిమ్మటపోయేవాడు ప్రతీవాడు బంధువే! బంధువులట! బంధువులు! రానీ! మూటాముల్లె కట్టేటట్టు చేస్తాను.

(తలుపు తట్టిన చప్పుడు)

ని: సీతాయమ్మగారూ!

సీ: వచ్చాడూ యీ దొంగదాసు! రానీ!...(ఏడుస్తూ) హుహుహు. రండీ! (తలుపుతీసి) దాసుగారూ! అయ్యో! అయ్యో!...ఎంత అవస్థతెచ్చి నా నెత్తిన పడేశేవురా నాయనా!

ని: అదేమండి పాపం! అల్లా విచారిస్తున్నారు.

సీ: (ఏడుస్తూ) ఏముంది నాయనా! యింత కష్టం వస్తుందనుకోలేదు. పిడుగు వచ్చి మీద పడిపోయింది.

ని: నిజమే లెండి! పెద్దపెద్దవాళ్ల మీదే యీ పిడుగులు పడుతూంటాయిలెండి! యింతకీ ఆ పిడుగు ఏమిటో చెప్పారు కారు!

సీ: యింకేముందండి! ... మా మామగారు లేరూ!

ని: ఉన్నారు. కొంపదీసి! ఆయన కాని...

సీ: ఆయన కాదండీ! ఆయన పినతండ్రి కొడుకు పోయాడు.

ని: అరరె! అయితే పారిపోయాడా! చచ్చిపోయాడా!

సీ: (ఏడుస్తూ) పారిపోతే యింతగా ఏడ్వడ మెందుకండి! చచ్చిపోయాడు కనుకనే దుఃఖం పొంగి పొరలివస్తూంది.

ని: పాపం! ఎప్పుడు పోయాడు!

సీ: యీ వేళ ప్రొద్దున్నటండీ! యిప్పుడే టెలిగ్రాం వస్తే ఆయన ఉరకలు వేసుకుంటూ పరుగెత్తారు. నేనంటే వాడికి ఎంతో అభిమానం.

ని: అయ్యయ్యో! ఎంత కష్టం! ఎంత కష్టం! కష్టాలు మానవులకే వస్తాయి! అందులో, ఓపిగ్గా అనుభవించేవాళ్లకి మరీ వస్తాయి.

(అనంతబుద్ధి ప్రవేశం)

అ: అదేమండీ! సీతాయమ్మ మామ్మగారూ! అల్లా విచారిస్తున్నారు.

ని: రావోయి! అనంతబుద్ధి! యీవిడకు తగని కష్టంవచ్చి మీదపడింది. యీవిడ మామగారి పినతండ్రికొడుకు పాపం! పరమపదించాడు.

అ: అయ్యయ్యో! మీరు యింకా అలా చూస్తారేం! కాస్త ఆ గీతాసారం ఆవిడకు బోధించి ధైర్యం చెప్పండి! యిటువంటి కష్టాలలోనే మీ పురాణాలు ప్రయోజనం చూపించాలి!

ని: అది నిజమే కానోయి! యిటువంటి కష్టాలు వచ్చినప్పుడు నా గీత బాగా పలకదు. యీవిడని చూస్తోంటే నాకే ఎంతో దుఃఖం వస్తోంది.

సీ: (విచారంగా) నాకు మరొకందుకు మరీ దుఃఖం వస్తోంది. మీకు యింత కష్టం కలిగించవలసివస్తుందని కలలో కూడా అనుకోలేదు.

ని: (ఆశ్చర్యంగా) మాకు కష్టమా! (విచారంగా) మాకు కూడా ఏం కష్టం వచ్చిందండీ!

సీ: యింకేముంది! మాకా 12 రోజులు మైల. నేను యింట్లో వండడాన్కి వీల్లేదు. పైగా నేను మా మామగారి పినతండ్రిగారి ఊరు వెళ్లాలి. పాపం! మీకు భోజనాన్కి చాలా యిబ్బంది కలుగుతుంది. మళ్లీ తిరిగి ఎప్పుడొస్తానో నాకే తెలియదు.

ని: యిది అంత పెద్దకష్టం కాదనుకోండి! మీరు కాస్త సెలవిస్తే, నేను యింట్లో వంటఅంతా చేస్తాను. నలభీమ పాకాల్లో ఆరితేరిన ఘటికుణ్ణండి నేను.

అ: కావాలంటే నేను కూడా ఒక చెయ్యి అందిస్తా దాసుగార్కి.

సీ: నాకేమీ అభ్యంతరం లేదుగాని! మావాళ్లు ఒప్పుకోరు. మైలయింట్లో వంటలేమిటి అదీ దెప్పిపోస్తారు బాబు! బంధువులంతా! మీకేం తెల్సు మా కష్టాలు!


అ: మరేనండి! కష్టాలమీద కష్టాలు! ఎన్నో కష్టాలు! అన్నీ ఒక్కసారిగానే వస్తాయి!

సీ: మీరు వెళ్లిపోవలసి వస్తున్నందుకు నాకు ఎంతో విచారంగా ఉందంటే నమ్మండి! యిన్నాళ్లూ, తలలో నాలికలా ఎంతో కలిసిమెలిసి స్నేహంగా ఉంటున్నారు.

అ: దాసుగారూ! మీరు పోనీ యీ పన్నెండురోజులు గ్రామంలో మరొక భక్తులింట బసచేయండి! నేను సీతమ్మ మామ్మగార్ని వాళ్ల బంధువులింట్లో దిగబెట్టి వస్తా.

సీ: ఎందుకు నాయనా! నీకంత శ్రమ! ఒకళ్లని కష్టపెట్టడం నా కిష్టంలేదు. పైగా, నేను అక్కడికి వెళ్లానంటే, అదే పనిగా ఉండమని తెగ బలవంతం చేస్తారు తిరిగి ఎప్పుడు వస్తానో నాకే తెలియదు.

ని: ఉంటే సీతాయమ్మగారింట్లో ఉండాలి! తింటే అక్కడే తినాలి. యింకొకరి యింటికి రమ్మంటేమాత్రం వెడతా



డనుకున్నావుటోయి యీ నిరంజనదాసు!

అ: సీతమ్మ మామ్మగార్ని యీ కష్ట కాలంలో ఒక్కర్ని విడిచిపెట్టవలసి వస్తున్నందుకు నాకు చాలా బాధగావుంది!

ని: నాకు మరీ బాధగావుంది! ఏం చేస్తాం! ధైర్యం పురుషలక్షణం అని చెప్పాడు గీతలో.

అ: మరయితే! ఏంచేద్దాం! నాకు యింకా పనికాలేదు యీవూళ్లో యింకా! ఊఁ.

ని: ఆ రామావధాన్లుగారైనా లేరు! సలహా అడగటానికి! పోనీ యీప్రక్కనే ఉన్న భాగోతులపల్లి వెళ్లి కొన్నాళ్లు హరికథాకాలక్షేపంచేసి, సీతమ్మగారు వచ్చాక మళ్ళీ రావచ్చు యిక్కడకు.

అ: పదండి. నేనుకూడా అక్కడ ఆహారసేకరణ విషయం ఎల్లా వున్నదీ తనిఖీ చేసి వస్తాను.

ని: సీతాయమ్మగారూ! మరి సెలవా వస్తాను.

అ: సీతమ్మ మామ్మగారు! సెలవు! వెంకటశాస్త్రివస్తే నేను వచ్చేనని చెప్పండి.

సీ: మంచిది నాయనా! పాపం! మాకు వచ్చిన యీ కష్టంవల్ల మీకు ఎన్ని చిక్కులు కలుగుతున్నాయి!... అప్పుడప్పుడు తప్పకుండా వస్తూ ఉండండి!

అ: ని: అల్లాగే లెండి!

(నిష్క్రమణ).

సీ: అమ్మయ్య! పోయారా! శని విరగడైంది. యిదేమన్నా ధర్మసత్ర మనుకున్నారా పడి మింగడానికి!

(తలుపుకొట్టిన చప్పుడు).

రా: సీతా! సీతా!

సీ: ఆ. ఆ. వస్తున్నాను. (తలుపుతీసిన చప్పుడు).

రా: వాళ్లు యింకా రాలేదా భోజనానికి!

సీ: రావడం అయింది! సాగనంపడం అయింది.

రా: అన్నంతపని చేశావు! నీ తెల్వితేటలు మండిపోనూ! యిదేంపనే! ఎల్లా పంపించేవు!

సీ: మామగారి పినతండ్రి కొడుకు పోయాడు! మాకు మైల. పైగా మేము వూరు వెళ్లాలి. మీ దారి మీరు చూసుకోండని చెప్పాను. ఆపళంగా వెళ్లిపోయారు.

రా: యిదేం అఘాయిత్యమే! చావు కబురు కల్పించి బంధువులని సాగనంపుతావటే! ఎంత తప్పు! ఎంత తప్పు!

సీ: తప్పేమిటండీ! మామగారికి పినతండ్రీ లేడు! పినతండ్రికి కొడుకూ లేడు. లేనివాళ్లు చచ్చేరంటే మరేమీ తప్పులేదు. లెండి! లెండి! భోజనానికి లెండి! నాకు నీతులు చెప్పొచ్చారు.

## 3 వ రంగం

(వీధిలో)

నిరంజనదాసు: అనంతబుద్ధీ! యింత పని జరుగుతుం దనుకోలేదోయి! రెండు నెలలనుంచి నిరాఘాటంగా జరిగిపోతూంది యీ గ్రామంలో భుక్తి! యీనాటికి సీతమ్మగారు నాకు స్వస్తి చెప్పింది.

అనంతబుద్ధి: ఆవిడ చాలా దేవాంతకురాలులా కనిపిస్తోందండీ! నేను మొదట్లో ఏమిటో అనుకున్నానుగాని.

ని: సమయానికి రామావధాన్లుగారు లేకపోయారు. ఉంటే యింకా కొంత కాలం గడిచేది. 'మాదొడ్డ' మనిషి రామావధాన్లు మాత్రం

అ: ఆయనకు తగిన భార్య దొరకలేదండి! అదే నా విచారం. అయిపోయిందానికేంగాని, భాగోతులపల్లి వెళదామంటారా!

ని: సీతమ్మగారిముందు అల్లాగనకపోతే బాగుండదని అన్నానుగాని, వెడితే మనకి దిక్కెవరోయి అక్కడ.

అ: అలాగాండీ! మీ కెరిగిన బంధువులెవరైనా ఉన్నారేమో అనుకుంటున్నాను.

ని: సరేకాని! అనంతబుద్ధి! మన భండారుపురం వెళ్లి అక్కడ కొన్నాళ్లు హరికథా కాలక్షేపం చేస్తే కృష్ణపరమాత్మ సంతోషిస్తాడు. వెడదాముటోయి!

అ: మీరు వెడితే వెళ్లండిగాని, నాకు యిప్పుడు రావడానికి తీరికలేదు.

ని: పోనీ మీ యిల్లెక్కడ! మీరు వచ్చేలోగా మీ యింట్లోవుండి మీ రాకకు ఎదురు చూస్తుంటాను.

అ: నాకు యిల్లంటూ వుంటేకదండీ! భండారుపురంలాంటి మహాపట్నంలో యిల్లెక్కడ దొరుకుతుందండీ! నాకు బంధువులంటే మహా పెద్ద అభిమానం. కొన్నాళ్లు ఉంచుకుని ఆదరిద్దామన్నా, ఒక అద్దెకొంపైనా లేదు. అందుచేత బంధువు లెవరూ మా యింటికి రారు.

ని: పోనీ నా సంగతికేంగాని! మీ భార్యాబిడ్డలు ఎక్కడ వుంటున్నారోయి!


రాజాబ్రాండ్ బంగారు కవరింగ్

ఆభరణములు

కలరు 10॥ సం॥ గ్యారంటీ




రౌండు, బాదం, కాపీ చంద్రహారములు 42 యించి, పేట 1-కి రు. 11/- సాదా నల్లపూసల చైను 18 యించి 1-కి రు. 5/- ఫ్లవర్ నల్లపూసల చైను 18" యించి 1-కి రు. 7/8/- ఆర్డరుతో 800 డిజైనులుగల క్యాటలాగుపంపబడును ప్యాకింగు పోస్టేజి రు. 1-0-0 అదనము.

రాజాగోల్డు కవరింగ్ కంపెనీ;(రిజిష్టర్డు)

రాజాబిల్డింగ్సు, మచిలీపట్నం


అ: మా మామగారింట్లో దిగబెట్టాను భండారుపురంలో! నే నెప్పుడైనా అక్కడకు వెడితే మా మామగారింట్లోనే బస.

ని: అల్లాగా! పోనీ! మీ మామగారికి ఒక ఉత్తరం ముక్క రాసియ్యవోయి! వారి సహాయంతో నేను జయప్రదంగా కొన్నాళ్లు హరికథాకాలక్షేపం చేసుకుంటా నక్కడ.

అ: మా మామగారు ఆయన మామగారిపై ఆధారపడి ఉన్నారు. మా మామగారికి ప్రత్యేక ఉద్యోగంలేదు. నాలాగే ఆహార సేకరణ తప్ప. మా మామగారి మామగారే యీ వంశాన్నంతా భరిస్తున్నారు.

ని: అయితే నీకు ఉద్యోగం లేదూ! ఏదో ఆహార సేకరణ డిపార్టుమెంటులో పని అన్నావు గదయ్యా!

అ: రామావధాన్లుగారితో అల్లా అనక


సువర్ణ మేహ వంగరాజీయం

బలహీనత, నడుమునొప్పులు, కీళ్ళనొప్పులు, కాళ్లుమంటలు, మూర్ఛ, నోటిపూత, రక్తపిత్తము, అతిమూత్రము, మధుమేహము, ధాతునష్టము, జీర్ణించిన గనేరియా, స్త్రీలశ్వేత, రక్తప్రదరములు మొ॥ సమస్తమేహములకు రామబాణము. తులం రు 12/- వి. పి. అ 14.

ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

పోతే బాగుండదని అన్నాను. ఉద్యోగం ఉంటే యిన్ని వూళ్లు తిరగడ మెందుకండి! ఉద్యోగ సంపాదనకోసమే యీ ప్రయత్న మంతా! యీ ప్రయత్నంలో నేను ప్రతీ రోజు ఆహారసేకరణ సమస్య పరిష్కరిస్తూ ఉండాలి.

ని : మహా ఘట్టివాడవోయి! నేను యింకా నీతో భండారుపురం వచ్చి, నీతో కొన్నాళ్లు అక్కడ వుందా మనుకుంటున్నాను.

అ : నాకు నిజంగా మిమ్మల్ని చూసి నప్పటినుంచి ఎంతో బంధుఅభిమానేమంటే నమ్మండీ, కాని పరిస్థితులు యిల్లా మండి పోతున్నాయి. మా తాతగారి పేరగరూ! సూరయ్యగారు. ఆయన నిరతాన్న ప్రదాతలుగా! నిత్యం వారి యింట్లో అధమం ఒక పాతిక విస్తళ్లు అతిధులకు వేయవలసిందే!

ని : అల్లాగటోయి! మీ తాతగారు చాలా గొప్పవారన్నమాట!

అ : మరేనండీ! అయితే దాసుగారూ! యింతకీ తమ స్వస్థలం ఏ ఊరు?

ని : నాకు ఒక ఊరంటూ లేదోయి! చిన్నప్పటినుంచి నాకు యీ హరికథా కాలక్షేపం ఏదో ఆ పరమాత్ముణ్ణి ధ్యానించుకో వటంతో జీవితం గడిచిపోతూంది. కాని నేను పుట్టినవూరు, లేనిపాడు.

అ : మీ భార్యా పిల్లలు లేనిపాడులో ఉన్నాగన్నమాట!

ని : నాకు భార్యా లేదు! పిల్లలూ లేరు! నేను ఒంటిగాణ్ణి!

అ : అయ్యయ్యో! పాపం! మరి పెళ్లి చేసుకోలేదాండి!

ని : పెళ్లికోసమేనోయి యీ ప్రయత్నమంతా / ఏదో హరికథలు చెప్పి నాలుగు రాళ్లు వెనక వేసుకుంటున్నా.

అ : అలాగటండీ! నేను యింకా ఒకసారి మీవూరువచ్చి మీ భార్యా పిల్లల్ని చూచి, కొన్నాళ్లు అక్కడవుండి, ఆహార సేకరణ విషయము తనిఖీ చేద్దామనుకుంటున్నాను.

అని : అంతేలెండి! గీతలో చెప్పాడు అంతా యోగం అని. యోగం ఉంటే! గాని ఏ పని చేయలేం.

అ : బాగోతులపల్లి వెళ్లడం మా నేసినట్లేనాండి.

ని : వెడితే అక్కడ మనల్ని ఎరిగినవారెవరు? ఎవరైనా కొస్త ఎరిగినవాళ్లుంటే కొంత కాలక్షేపం.

అ : మరేనండీ! మరి నాకు సెలవిప్పిస్తారా! నా దారి నే చూసుకుంటా! నమస్కారం.

ని : వెళ్లిరా నాయనా! నిరంజనార్పణమస్తు!!

(ఆలిండియా రేడియో, హైద్రాబాదు, సౌజన్యంతో)

★


బిడ్డల అజీర్ణమా?

GRIPELIX త్రుటిలో వారి కడుపునొప్పి, వాంతి, భేదులు, ఉబ్బరము, జ్వరము, దగ్గు, ఏడ్పులు మొదలగువాని నెల్ల హరించి, వారికి హాయి, మీకు ఆనందము కూర్చును.



గ్రైపెలిక్స్ ఏమరకండి. ఈదివ్యామృతము, బిడ్డల ఆరోగ్యము కాపాడుచు, బలవంతుల గావించుటలో శ్రేష్ఠమైనది.

*Mfrs* Synthetic Medical Products.

Madras 10.— Ongole.

*Stockists* : Standard Drug & Chemicals,
131, Nainiappa Naik St., Madras.

నపుంసకతైలం

అంగ, నరములు బలహీనత చెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ వి. పి. రూ 1-0-0.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్స్,
హైద్రాబాద్, దక్కన్.


మేష్టరు : "సుశీలా! 1605 లో ఏం జరిగింది?"

సుశీల : "అక్బరు చచ్చిపోయాడండి."

మేష్టరు : "1705 లో ఏం జరిగింది?"

సుశీల : "అక్బరు చచ్చిపోయి వందేళ్లయిందండి."

* * * *

డాక్టరు : "మీభర్తగారికి మరేమీ ఫర్వాలేదు. బాగా విశ్రాంతి, నిద్ర ఉండాలి. ఇవిగో నిద్రపట్టేందుకు మాత్రలు."

రోగిభార్య : "ఈమాత్ర లెప్పుడిమ్మంటారు ఆయనకి?"

డాక్టరు : "అవి ఆయనక్కాదు, మీకు."